అప్రజాస్వామిక జీవో1ని ప్రభుత్వం ఉపసంహరించుకునే వరకు ఉద్యమం

భోగిమంటల్లో జీవో1 ప్రతుల దహన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అప్రజాస్వామిక జీవో నంబరు 1ని రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకునే వరకు ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామేశ్వరరావు నేతృత్వంలో సీపీఐ జిల్లా, స్థానిక నాయకులు అప్రజాస్వామిక జీవో నంబరు1 ప్రతులను ఎస్.కోట పట్టణం, నానిగిరివీధి మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో వేసి కాల్చారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన ప్రజాస్వామిక హక్కులను కాలరాసే జీవో నంబరు 1ని వ్యతిరేకిస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈనెల 23వరకు హైకోర్టు నిలుపుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్నాయని, వారికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకూడదనే విధంగా వ్యవహరిస్తున్నారని, పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నేతలను గృహనిర్బంధం చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, తీర్పునిచ్చే న్యాయమూర్తులపై కూడా విమర్శలు చేసే స్థితికి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి పోరాటాలు చేసేందుకు ఒక తాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికారంలో ఉన్నవారు ఎటువంటి అనుమతులు లేకుండా గుంపులుగా రోడ్లపై తిరగవచ్చా అని ప్రశ్నించారు. అదే ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారైతే పోలీసుల అనుమతి తీసుకోవాలా? ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని విమర్శించారు. అప్రజాస్వామిక జీవో నంబరు 1 ప్రతులను భోగి మంటల్లో వేసి కాల్చిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మద్ది కృష్ణ, మండల నాయకులు కండిపల్లి భీముడు, షేక్ స్వామి, నిమ్మకాయల అప్పలరాజు, అప్పా రావు, కళాసీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నిరంకుశ జీవో 1 ను తక్షణమే రద్దుచేయాలి : ఒమ్మిరమణ

బొబ్బిలి: రహదారిపై సభలు, సమావేశాలను రద్దుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను రక్షించాలని సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా బొబ్బిలి పట్టణంలో భోగిమంటల్లో జీవో కాపీలను సిపిఐ ఆధ్వర్యంలో భోగిపండుగ మంటల్లోవేసి తగలబెట్టి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగాసిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ సిపిఐ బొబ్బిలి నియోజకవర్గం కార్యదర్శి కండాపు ప్రసాద్‌రావులు మాట్లాడుతూ ప్రభుత్వాలు తప్పులుచేస్తున్నప్పుడు ప్రజలు ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించిందని అటువంటి హక్కును కాలరాసే హక్కు ఎవరికీ లేదని అన్నారు. ప్రజలు కార్మికులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వాళ్లు ప్రశ్నిస్తారని దానికి ప్రభుత్వం సమాధానం చెప్పలే కానీ నిర్బంధంతో ఉద్యమాల్ని ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు వెంపల బాబ్జి కే వెంకట సత్యనారాయణ, యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోఅప్పన్న, ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి డివిజన్ కార్యదర్శి బోను రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీఓ ని తీసుకొస్తే ప్రజాపోరాటాలు తప్పవ్

విజయనగరం: ప్రజాస్వామ్యబద్ధం గా ప్రభుత్వాలుచేస్తున్న ప్రజావ్య తిరేక విధానాలను ప్రశ్నించే గొంతుకులను నులిమెసేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అడ్డదారుల్లో ఓ చీకటి జీఓని తీసుకొస్తే ప్రజాపోరాటలు ఆపే ప్రసక్తేలేదని సిపిఐ జిల్లా సహా య కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరించారు. శనివారం సిపిఐ విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా అమర్ భవన్ ముందు వేసిన భోగి మంటల్లో చీకటి జీఓ 1 ప్రతులను దగ్గం చేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మీడియాలో మాట్లాడుతూ భారత దేశం ఎంతో పవిత్రంగా భావించే రాజ్యాంగాన్ని కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ఇద్దరూ కలిసి తుంగలోకి తొక్కి ప్రజాస్వామ్యాన్ని హక్కుల్ని కలరాస్తే తప్పులేదు కానీ ప్రజలకి జరుగుతున్న అన్యాయం పై ప్రభుత్వాలను ప్రశ్నించే వారిని నిర్బంధాలకి గురిచేయడానికి అడ్డదారుల్లో చట్టసభల్లో చేస్తున్న చీకటి జీవో వెనక్కి తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఈ జీవోను వెనక్కి తీసుకునే అంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందని వారి హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. రంగరాజు, బాయి రమణమ్మ, బుగత పావని, జిల్లా సమితి సభ్యులు పురం అప్పారావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, విశాలాంధ్ర బుక్ హౌస్ ఇన్చార్జ్ సయ్యద్ ఇబ్రహీం, నియోజకవర్గ సభ్యులు ఏ.రాములు, అప్పురుబోతు జగన్నాధం హాజరయ్యారు.

హైకోర్టు మధ్యంతర తీర్పును గౌరవించి రద్దుచేయాలి

రేగిడి: రాజం మల్లికార్జున కాలనీలో సిపిఐ ఆధ్వర్యంలో భోగి మంటల్లో ఆధ్వర్యంలో జనవరి 2వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలను, ప్రజా ఉద్యమాలను అణచివే యడానికి విడుదల చేసిన అప్రజాస్వామ్యక జీ.వో.ఒకటి 1861 పోలీస్ యాక్ట్ బ్రిటిష్ పాలకుల చట్టాన్ని దేశ ప్రజలపై అమలు చేయటానికి వ్యతిరేకిస్తూ జీ.వో. నెంబర్ వన్ పేపర్లను భోగి మంటల్లో వేసి దగద్దం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర హైకోర్టు మధ్యంతర వ్యాఖ్య చేస్తూ పోలీస్ యాక్ట్ 1861 రాష్ట్రంలో అమలు జీ.వో తీసుకురావటం సరైంది కాదని తీర్పు ఇచ్చిందని.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా జి ఓ వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. దుర్మార్గమైన పోలీస్ యాక్ట్ 1861 అమలు జీ.వో ఒకటిని ప్రతిఘటిస్తామని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటరమణ తో పాటు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో జీవో ప్రతులు దహనం

చీపురుపల్లి : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విజయ నగరం జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు చీపురుపల్లి నియోజకవర్గం ఇన్చార్జి కిమిడి నాగార్జున సూచనలమేరకు చీపురుపల్లి టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గవిడి నాగరాజు ఆధ్వర్యంలో చీకటి జీవో నెంబర్ వన్, టీడీపీ నాయకులు పై పెట్టిన అక్రమ కేసులు కాపీలను భోగిమంటలు దహనం చేస్తున్న చీపురుపల్లి టౌన్ టీడీపీ అధ్యక్షుడు గవిడినాగరాజు చీపురుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముళ్ళు రమణ. గరివిడి మండలం కొమరం గ్రామ పంచాయితీ టీడీపీ నాయకురాలు, సర్పంచ్ ముళ్ళు రమాదేవి, లెంక లక్ష్మణ రావు. కెంబూరు మహేష్. వైగాల సత్యం. అంబల్ల చిన్న. పిన్నింటి దుర్గారావు, టీడీపీ నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాలొన్నారు.

డెంకాడ: మండలంలోని నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం అక్కివరం గ్రామంలో శనివారం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు డెంకాడ మండలం మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు భోగి మంటల దగ్గర పాల్గొని సైకో పోవాలి సైకిల్ రావాలి నినాదాలు చేస్తూ జగన్ మోహన్ రెడ్డి జారీ చేసిన బ్రిటిష్ కాలం నాటి జీవో నెంబర్ 1 పత్రాలను భోగి మంటలో వేసి తగల బెట్టారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలు వీరే..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపు కోట ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగి సాయి. విజేతల వివరాలను కోచ్ పొట్నూరు శ్రీరాములు శనివారం ప్రకటించారు. సబ్ జూనియర్ సింగిల్స్ విభాగంలో షేక్ అబ్దుల్ (ప్రధమ), వి.శ్రీనివాసరావు (ద్వితీయ), జూనియర్స్ లో మొహ్మద్ నిషాద్ ఫాతిమ (ప్రధమ), పాలవలస రమ్య (ద్వితీయ), సీనియర్స్ సింగిల్స్ లో బరిణికాని హారిక (ప్రధమ), పంపాన మౌనిక (ద్వితీయ), డబుల్స్ లో మోపాడ జాన్సన్ / మట్టా చరణ్ తేజలు (ప్రధమ), పొట్నూరు హరిచందన్ / పంపాన మౌనికలు (ద్వితీయ) స్థానాలు సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా రంగోలి ముగ్గులపోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో పి.మౌనిక, బి.హారిక, సి హెచ్.మహాలక్ష్మిలు ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పోటీలలో గెలుపొందిన వారికి ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, ఆనల రమేష్ ల సౌజన్యంతో గెలుపొందిన క్రీడాకారులకు అగ్నిమాపక కేంద్రం అధికారి షేక్ మదీన, ఆనల మోహన్, కోచ్ మొహమ్మద్ అస్లాం, చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు విజేతలకు బహుమతులు అందజేశారు.

అగ్ని బాధితులకు పెద్దిరెడ్ల ఆర్థిక సాయం

విశాలాంధ్ర -వేపాడ/లక్కవర పుకోట: లక్కవరపుకోట మండలంలోని కల్లేపల్లిరేగ గ్రామంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధితులకు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు పెదిరెడ్ల రాజశేఖర్ ఆర్థిక సాయం అందించారు.ఈ అగ్ని ప్రమాదంలో 13పూరిల్లు దగ్ధమైన విషయం పాటకులకు తెలిసిందే.ఈ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు పెదిరెడ్ల అండగా నిలవడంతో పాటు కుటుంబం ఒక్కింటికి వెయ్యి రూపాయలు చొప్పున 13వేలు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు అందరూ నిరుపేదలేనని వీరిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రజలంతా ఆనందంతో కేరింతలు కొడుతున్న సమయంలో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుని ఈ 13 కుటుంబాలను రోడ్డున పడేయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాలకులు అధికారులు స్పందించి తక్షణ సాయం అందజేతతో పాటు పక్కా గృహాలను మంజూరు చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

మృతుల కుటుంబీకులకు ఎమ్మెల్యే శంబంగి పరామర్శ

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం అన్నం నాయుడు వలస గ్రామంలో ఇటీవల వరి నూర్పు యంత్రం తిరగబడిపోవడంతో గోర్లి తిరుపతమ్మ, పోల లక్ష్మమ్మ, అక్కడికక్కడే మృతి చెందారు మరో ఇద్దరి మహిళలకు తీవ్ర గాయాల య్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు శనివారం ఆయా కుటుంబీకులను పరామర్శించి ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న ఇద్దరు మహిళలకు మెరుగైన వైద్యంఅందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మృతుల కుటుంబీ కులను అధైర్యపడొద్దని వాళ్లలో మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ఆయన వెంట చింతాడ సర్పంచ్ బంకురు తిరుపతిరావు వైసీపీ నాయకులు మరడానా అప్పలస్వామి మరడాన దాలినాయుడు, కొట్నాన శ్రీను జగ్గు నాయుడుఉన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-భోగాపురం : సంక్రాంతి పండగ సందర్భంగా భోగాపురం గ్రామంలో శనివారం వైఎస్సార్సీపీ నాయకుడు పడాల శ్రీనివాసరావు పేదలకు దుస్తులు పంపిణీ చేసారు. మహిళలకు చీరలు, వృద్ధులకు పంచెలు అందజేశారు. గత 7 సంవత్సరాలుగా పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని, ఈ సంవత్సరం ఇంకా పెద్ద ఎత్తున 1000 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. దుస్తులను అయన కుటుంబ సభ్యులు నెల్లిమర్ల రామతీర్థం ఆలయం బోర్డు సభ్యులు, మాజీ జెడ్పిటిసి పడాల రాజేశ్వరి, మండల, మండల వైస్ ఎంపీపీ పడాల సత్యవతి పేదలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రౌతు వాసు, సాధురావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు రంగవల్లులు

మాజీ ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి

విశాలాంధ్ర-జామి: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా రంగవల్లులు నిలుస్తాయని, ప్రతీ సంక్రాంతి పండగకు రంగువల్లుల పోటీలను నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తుందని ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కన్వీనర్ కోళ్ళలలితకుమారి తెలిపారు. శనివారం మండలంలోని అలమండ గ్రామంలో మాజీ జెడ్పీ చైర్మన్ లగుడు సింహాద్రి జ్ఞాపకార్థం టీడీపీ ఆధ్వర్యంలో రంగవల్లులు, కుర్చీలాట వంటి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కోళ్ళలలితకుమారితో పాటు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళరాం ప్రసాద్‌లు హాజరయ్యారు. రంగువల్లుల పోటీలను తిలకించి విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతులను అందజేసారు. అనంతరం టీడీపీ నేత ముకుంద శ్రీను ఆహ్వానం మేరకు మండలంలోని పుష్పగిరి పురాతన శ్రీవేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్లమెంటరీ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మాకిరెడ్డి శ్రీలక్ష్మి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వల్రి రమణ, అలమండ ఎంపిటిసి డెక్కా శ్రీను, టీడీపీ నేతలు లగుడు అప్పలనాయుడు,పాత్రు అప్పలనాయుడు, బీల త్రివేణి, బండారు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పండగ పర్వదినాన పేదలకు నిత్యవసరాలు

విశాలాంధ్ర -విజయనగరంటౌన్: సంక్రాంతి పండగల సందర్భంగా ప్రతి సంవత్సరం లాగే, ఈ సంవత్సరం కూడా 'మదర్ తెరిసా సేవా సంఘం & బ్లడ్ డోనర్స్ క్లబ్ మదర్ తెరిసా కిడ్స్ స్కూల్' సంయుక్తంగా పట్టణంలో అయ్యన్నపేట జంక్షన్ పరిసర ప్రాంతంలో ఉన్న నిరుపేదలకు సంక్రాంతి పండగ పర్వదినాన ఆ నిత్య వసర వస్తువులు, అయ్యన్నపేట జంక్షన్లో ఉన్న "మదర్ తెరిసా కిడ్స్ స్కూల్" లో అందించడం జరిగింది. ఈ సంక్రాంతి పర్వదినాన ఈ పేద కుటుం బాలన్నీ చిరునవ్వుతో సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మదర్ తెరిసా సేవా సంఘం అధ్యక్షులు & ఫౌండర్ త్యాడ ప్రసాద్ పట్నాయక్, సంఘ సభ్యులు శ్రీనివాస్, శివదీప్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-రేగిడి : రేగిడి మండలం సంకిలి గ్రామంలో పేకాటఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసి రూ.13,600స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాసరావుతెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కోసంరాజాం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. పండగరోజుల్లో గ్రామాల్లో పేకాట ఆడిన వారిపై కేసులునమోదు చేస్తామన్నారు. పేకాట ఆడుతున్న వారిపైనిఘా ఉంచి గ్రామాల్లో దాడులు జరుపుతున్నట్లు తెలిపారు.

సిబిసి ఎన్‌సి ఆస్తులను పరిరక్షించండి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సి బి సి ఎన్ సి ఆస్తులను పరిరక్షించాలని కార్యదర్శి డాక్టర్ ఆర్ ఎస్ జాన్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్ఎంబి చర్చిలో జరిగిన 68వ మహాసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సోంపేట నుండి అవనిగడ్డ వరకు సి బి సి ఎన్ సి ఉన్న కోట్లాది రూపాయలు విలువచేసే భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి అన్నారు. ప్రస్తుతం విశాఖపట్నంలో వైసీపీ ప్రభుత్వానికి చెందిన కొంతమంది వ్యక్తులు లక్షల కోట్లు విలువ చేసే భూమి దోచుకోవడానికి చూస్తున్నారని తెలిపారు. ప్రభు త్వం వెంటనే స్పందించి సిబి సిఎన్‌సి ఆస్తులపై సిబిసిఐడి ఎంక్వయిరీ వేయాలన్నారు. క్రైస్తవులు కానీ వారు ఆస్తులు అన్యాక్రాంతం చేస్తున్నారని వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రానున్నకాలంలో చర్చలకు సంబంధించిన ఆస్తులపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షులు ఆనందరావు, కే సుకుమార్, శామ్యూల్ రాజు, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు బేబీనాయనా చేయూత

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రం లోని శుక్రవారం ఉదయం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వశ్యం కోల్పోయి రోడ్డునపడ్డ నక్కల కుటుంబాల వారికి శనివారం నాడు బొబ్బిలి యువరాజా, మాజీ మున్సిపల్ చైర్మన్, టిడిపి నియోజకర్గ ఇంచార్జి బేబీనాయనా ఒక్కో కుటుంబానికి 2వేలనగదు, 100కేజీల బియ్యం, పప్పులు,కూరలు, దుప్పట్లు చొప్పున ఏడు కుటుంబాల వారికి అందజేసారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో పెదభోగిలి మేజర్ పంచాయతీ సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ గరికయ్య,నాయకులు సాలా హరి, మాజీ సర్పంచ్ బుడితి శ్రీను, మాజీ ఎంపీటీసీలు సబ్బాన శ్రీను, సబ్బాన గోపాల్, సతీష్, చింతాడ సత్యనారాయణ, వర్క్ షాప్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాలాడ లో ఏనుగుల బీభత్సం

విశాలాంధ్ర-భామిని: తాలాడ గ్రామంలో ఏనుగుల గుంపు సంచారం రైతులకు తీవ్ర నష్టం.మండలంలో వంశధార నదీ పరివాహక ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తూ జొన్న, చెరకు, అరటి, కూరగాయ పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఈ మేరకు శుక్రవారం తాలాడ గ్రామ సమీపంలో సంచరిస్తూ రైతు ధాన్యం కలల్లో నిల్వలపై దాడి చేసినట్లు రైతులు తెలిపారు. రైతులంతా ఏనుగుల గుంపు సంచారంతో అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు కోరారు.

తప్పిన పెను ప్రమాదం : అగ్నిమాపక సిబ్బందికిఅభినందనలు

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలం గోపాలపురం గ్రామంలో శనివారం సంభంగి తిరుపతిరావు గడ్డి కు కుప్పలకు నిప్పులు చెలరేగాయి. అక్కడ ఉన్న స్థానికులు సాలూరు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వెంటనే స్పందిం చారు. మంటలు అదుపు చేశారు. స్థానికులు ఏ ప్రమాదం లేదని సంతోషం వ్యక్తం చేశారు అగ్నిమాపక సిబ్బందికు అభినందనలు తెలియజేశారు.

అగ్నిబాధితులకు జనసేన ఆర్థికసహాయం

విశాలాంధ్ర-సీతానగరం: మండల కేంద్రం లోని శుక్రవారం ఉదయం సంభవించిన అగ్నిప్రమాదంతో సర్వశ్యం కోల్పోయి రోడ్డునపడ్డ ఏడుకుటుంబాల వారిని జనసేన నాయకులు, సైనికులు శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. పూర్తిగా కాలిపోయిన కుటుంబానికి రెండువేల రూపాయలు, పాక్షికంగా కాలిన ఇళ్లకు వేయి రూపాయలు చొప్పున నగదును జనసేననేత కొయ్యాన మోహనరావు బాధిత కుటుంబాలకు అందజేసారు.ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం ఐటి విభాగంనేత పైల సత్యనారాయణ, పార్వతీపురం, బలిజిపేట మండలాల పార్టీ అధ్యక్షులు ఆగూరి మని, పోలినాయుడు, నియోజక వర్గ నేత అల్లురమేష్ జన సైనికులు కల్యంపూడి సత్యనారాయణ, జయశంకర్,కిషోర్,సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మంజూరు చేసిన రెండో ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: విద్యా శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా మంజూరుచేసిన 692 మండల విద్యాశాఖా ధికారి పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 154 ప్రకారం ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఈ పోస్టులపై ప్రస్తుతం పనిచేస్తున్న మండల విద్యాశాఖాధికారుల సంఘం తమకు అనుకూలంగా లేదని లోగడ జీవో 154 ను రద్దు చేయమని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.కానీ తదుపరి ఆలోచించుకొని వేసిన రిట్ పిటిషన్ ను ఉపసంహరణ చేసుకున్నట్టుగా సమాచారం తెలుస్తోందన్నారు. అందువలన ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం కొత్తగా సృష్టించిన అదనపు 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను (ఎంఈఓ-2) భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని సామల తెలిపారు. ఇందుకుగాను జాప్యం లేకుండా జీవో 154 ప్రకారం ఎంఇఓ పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ చార్ట్, విధి విధానాలను తక్షణమే రూపొందించి, ముఖ్యమంత్రి ఆలోచన కు కార్యరూపం ఇవ్వాలని, ఇందుకు విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సామల సింహాచలం విజ్ఞప్తి చేశారు.

టిడిపి ఆధ్వర్యంలో భోగిమంటల్లో జీఓ -1 కాపీలు దహనం

మాజీ ఎమ్మెల్సీ జగదీష్ మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో శని వారం భోగిమంటల్లో ని జీవో ఒకటి కాపీలను దగ్గం చేసి నిరసన వ్యక్తం చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదంతో ప్లకార్డులను ప్రదర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపూడి జగదీష్, మండ లంలోని కృష్ణపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ బొబ్బిలి చిరంజీవులు అదే విధంగా నర్సిపురం టిడిపి నాయకులు గొట్టాపు వెంకటరమణ ఆధ్వర్యంలోనూ ములగ కవిటిభద్ర పులుగుమ్మి డీకే పట్నం గ్రామాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో టిడిపి శ్రేణులు జీవో ఒకటి కాపీలను దహనం చేశారు బ్రిటిష్ కాలం నాటి జీవోలు తేవడం వైసిపి అరాచక పరిపాలనకు ఇదే నిదర్శనమని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటిని తెచ్చి ప్రజల్ని, ప్రజా ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు అందరిలో గందరగోళం తెప్పిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు జి మోహన్‌రావు సీతానగరం మండల పార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతి రావు కౌన్సిలర్ బడే గౌడ్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు గొంగడ రామ్మూర్తి,, మాజీ ఏఎంసి చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు కాపారపు జనార్దన్ నాయుడు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మరిసర్ల కార్తీ క్ అరకు పార్లమెంటరీ తెలుగు యువత ప్రతినిధి కె ప్రదీప్ అంకంపేట టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు జాగాన ధనంజయ నాయుడు మండల తెలుగు యువత నాయకులు తురపాడ గణేష్ కృష్ణ పల్లి ఐ టి డి పి చాంపియన్ టి ప్రవీణ్ తరులు పాల్గొన్నారు.

జిఓనెం1 ను తక్షణమే రద్దు చేయాలి

పార్వతీపురం టౌన్/ బెలగాం: పోరాటాలు, నిరసనలు ధర్నాలు, ర్యాలీలు రాజ్యాంగంలో పౌరుని ప్రాధమిక హక్కు, ఈ హక్కును కాలరాసి నిర్బంధించిన జీవో తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ గత ప్రభుత్వాలు గతే పడుతుందని, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రా జ్యాన్ని కాలగర్భంలో కలిపే వైనం స్వాతంత్ర్య ఉద్యమ పోరాటం ఉద్యమ ఫలితమే, భారత రాజ్యాంగాన్ని సాధించుకోవడం, జగన్ ప్రభుత్వం దీన్ని గ్రహించాలని పలు ప్రజాసంఘాల నాయకులు శనివారం ఆ జీవో కాపీలను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి మూడు సంవత్సరాల పాదయాత్రలు రాజ్యాంగం పోరాట ఫలితంగా ముఖ్యమంత్రి పదవి వచ్చిందని ఇప్పుడు ఎవరూ పోరాటాలు, ధర్నాలు, నిరసనలు రోడ్లపై చేయకూడదంటే రాష్ట్ర విముక్తి పోరాటం చేయాల్సి వస్తుందని టీడీపీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి వేణు, మాజీ సర్పంచ్ బంటు దాసు డివైఎఫ్ఐ నాయకులు ప్రవీణు,యువకులు, రైతులు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో భోగి మంటల్లో వేసిన జీవో1 ప్రతులు

విశాలాంధ్ర-పాలకొండ: ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, పాదయాత్ర, బహిరంగ సభ లను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 1 కాపీలను, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు భోగి మంట లో వేసి నిరసన తెలియజేశారు. శనివారం వేకువజామున పాలకొండ మండలం ఎల్ ఎల్ పురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి నిరంకుశంగా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని ప్రజలపై పడుతున్న భారాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తులు రగులుతున్నాయని ఈ సందర్భంలో ప్రజలు వివిధ రూపాలలో నిరసనలు చేస్తున్నారని దీన్ని తట్టుకోలేక, ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రజా ఉద్యమాలను నిర్బంధాల ద్వారా అణచివేయాలని చూస్తున్నారని ఈ చర్యలను ప్రజాస్వామివాదులు ఖండించాలని కోరారు. ఈ మధ్యకాలంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగ సభ కార్యక్రమంలో జరిగిన ప్రమాదంలో కొద్దిమంది చనిపోవడం దీన్ని ఆసరా చేసుకుని ఈ విధంగా బ్రిటిష్ కాలంనాటి పద్ధతుల్లోనే నేటి జగన్ మోహన్ రెడ్డి ఆనాటి చట్టాలను గుర్తు చేస్తూ ప్రజా ఉద్యమాలను అనచ్చేవేయాలనుకోవడం అవివేకం అన్నారు. అటువంటి వారి కి చరిత్రలో ఏం జరిగిందో గుర్తు చేసుకోవాలన్నారు. జీవో నెంబర్ 1ని వ్యతిరేకిస్తు సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హైకోర్టుకు లో అపిల్ చేయగా కోర్టు తీర్పు వచ్చేంతవరకు జీవోను నిలుపుదల చేయమని చెప్పటం హర్షించవలసిన విషయమని ఎప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఆ జీ ఓ ఒకటి ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ద్వారపూడి అప్పలనాయుడు, గురుబిల్లి అప్పలనాయుడు, అల్లు వెంకటరమణ, మండాది సంతోష్, ముంజి వెంకటరమణ, వారాడ సంతోష్ కుమార్, వారాడ విశ్వనాథం, గురుబిల్లి రాంబాబు, ఎడ్ల శ్రీను, గంట సంతోష, అల్లు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు పలువురి చేయూత

విశాలాంధ్ర -సీతానగరం: మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం సంభవించిన అగ్నిప్రమా దంతో సర్వశ్యం కోల్పోయి రోడ్డున పడ్డ నక్కల కుటుంబాల వారికి పలువురు ముందుకు వచ్చిచేస్తున్న సహాయం మరువలేనిది. ఈఅగ్నిప్రమాదంలో చెరకుబిల్లి గంగయ్య, చెరకుబిల్లి అప్పల నరసమ్మ,చెరకుబిల్లి కవిత, చెరకుబిల్లి సరేష్ కుటుంబాలు సర్వస్యం కోల్పోయిన సంగతి తెలిసిందే. వీరితోపాటు మరో మూడు కుటుంబాలు పాక్షికంగా నష్టపోయారు. ప్రభుత్వం తరుపున రెవెన్యూ అధికారులు బియ్యాన్ని అందజేసారు. శనివారం ఎంపిడిఓ ప్రసాద్ వీరికి స్టీల్ సామాగ్రి, బట్టలను అందజేసారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, అతని కుమారుడు బొంగు శ్రీకాంత్, సాహితీలు ఏడు కుటుంబాలకు సరిపడే పదివేల రూపాయల సామాగ్రిని అందజేసారు. సీతానగరం ఆర్యవైశ్యసంఘం నాయకులు మమ్ముల విశ్వేశ్వరరావు, ఆరిశెట్టి సత్యనారాయణ, గురుమూర్తి,కూర్మదాసు శ్రీనివాసరావు, సురేష్, వాసు,త్రినాథ, దేముడు,ఆరిశెట్టి గోవింద్ తదితరులు బాధిత కుటుంబాలకు పప్పులు,బియ్యం, కూరగాయలు, దుప్పట్లు, దోవతులు తదితర సామాగ్రిని అందజేసారు. స్థానికులు పలువురు పలురకాలుగా సహాయం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గరికయ్య, ఉప సర్పంచ్ అరవింద్, ఎంపిటిసిలు గౌరీకిరణ్, బురిడి కుసుమ సూర్యనారాయణ, సోషల్ మీడియా మండల కన్వీనర్ సురేష్, వార్డు సభ్యులు బూడి రామారావు, రైల్వే ఉద్యోగి ప్రసాద్, విఆర్ఓ సింహాచలం, వాలంటీర్లు పాండవులు, తరుణ్, విశ్వబ్రాహ్మణ సంఘంనేత కృష్ణ తదితరులతో పాటు గూడెంవీధి ప్రజలు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం: బొలేరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండ లం పరశురాంపురం గ్రామానికి చెందిన బదిలి విశ్వనాథ్ బొబ్బిలి తాండ్రపాపా రాయ కళాశాలలో డిప్లొమా చదువుచున్నాడు. శనివారం మోటార్ సైకిల్ పై తన గ్రామం వస్తుండగా మమ్ముల సహదేవ్ ను త్రోవలో మోటార్ సైకిల్ పై ఎక్కించి తీసుకుని వస్తుండగా మార్కొండపుట్టి గోపాలపురం కూడలి మధ్య చింతలపోలమ్మ గుడి వద్ద మార్కొండపుట్టి వైపు నుండి పార్వతీపురం వస్తున్న బొలేరో వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో విశ్వనాధ్ కు తీవ్రగాయాలు సహదేవ్‌కు స్వల్ప గాయా లయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్సఅందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

సూడిగాం లో పేదలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని సూడిగాం గ్రామంలో శనివారం సర్పంచ్ పైన సూర్యనారాయణ సొంత నిధులతో పేదలకు చీరల్ను పంపిణీ చీరలు తీసుకున్న పేద మహిళలు సర్పంచ్ సూర్యనారా యణకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంక్రాంతి సందర్భంగా పేద మహిళకు చీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు పేదల కూడా సుఖంగా సంతోషంగ్గా పండగను జరుపుకోవాలని సర్పంచ్ సూర్యనా రాయణ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత తోనే దేశాభివృద్ధి ...

ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి జి.వి.ఆర్. కాలేజ్ ఆవరణలో ఆశయ యూత్ అసోషియేషన్, జాతీయ యువ జన వారోత్సవాలలో భాగంగా తిథి ప్రకారం ఈరోజు స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ వివేకానంద ఆశయాలను నేటి యువత స్ఫూర్తి గా తీసుకోవాలని లేవండి మేల్కొనండి గమ్యం చేరె వరకు శ్రమించండి అనే మాటలు నేటి యువతరం స్ఫూర్తి గా తీసుకోవాలని యువత కాలాన్ని వృధా చేయకుండా ప్రణాళికలు చేసుకొని చదవాలని. ఎక్కువగా మొబైల్ ఫోన్ వాడకం తగ్గించుకోవాలని కరెంట్ ఎఫైర్ మీద దృష్టి పెట్టాలని స్వామి వివేకానంద చెప్పిన సందేశం శ్రమే నీ ఆయుధం అయితే విజయం నీ బానిస అవుతుంది. కార్యక్రమంలో ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కె.హేమంత్. లక్ష్మణరావు, కోచ్ నవీన్, యువత పాల్గొన్నారు.

కుమ్మపల్లిలో భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కుమ్మపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు డెక్కబొమ్మి నాయుడు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శనివారం కుమ్మపల్లి గ్రామంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు డెక్క బొమ్మి నాయుడు 1972వ సంవత్సరంలో పరమపదించగా ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏటా భోగి పర్వదినాన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులైన డెక్క, దొగ్గ కుటుంబీకులు గ్రామంలో నిర్మించిన ఆయన విగ్రహం గుడి దగ్గర గ్రామ ప్రజలకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తారు. అలాగే ఆయన వారసలు మనవలు మనవరాండ్లు సోదరీమణుల కుటుంబీకులు వారి కుమారులు మనవరాలు దేశ విదేశాలలో ఎక్కడ స్థిర పడ్డా సంక్రాంతి సమయం వచ్చిందంటే స్వగ్రామమైన కుమ్మపల్లి చేరుకొని కుటుంబీకులు అందరూ కలిసి ఆయన మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు (సతీష్) కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న కూరల ధరలు.. ఏదైనా రూ.100 పైమాటే

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: హిందువులకు అత్యంత ఇష్టమైన పండుగలలో సంక్రాంతి ఒకటి. ఈ పండగకు సుధీర ప్రాంతాలలో ఉండే ప్రజలంతా తమ సొంత గూటికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో పండగ రోజున ఉదయాన్నే స్నానం అనంతరం తాము కొన్న కొత్త బట్టలు పెద్దలకు చూపించి పూజారులకు పొత్తర్లు ఇవ్వడం ఆనవాయితీ. పండగల గురించి ముందే తెలుసుకుంటున్న దళారులు ఏకంగా పొత్తర్ల మీద వేసే కాయగూరల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. ముఖ్యంగా వంకాయలు, బెండకాయలు, గుమ్మడికాయ, తీయదుంపలు, చామదుంప, కంద, చిక్కుడుకాయలు, మామూలు సమయ ములలో కేజీ 40 నుండి 50 పలకగా శనివారం మార్కెట్లో వీటి విలువ ఒక్కసారిగా 100 రూపాయల పై మాటే ఉండడం విశేషం. ఇక చెరుకు విషయానికి వస్తే 30 రూపాయల పై మాటే అమ్మారంటే ధరలు ఏ విధంగా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఇక పళ్ళు పూలు విషయానికి వస్తే కొబ్బరికాయ 30 రూపాయలు పలకగా డజను అరటి పళ్ళు ఏకంగా 50 రూపాయలు అయ్యాయి. పండగల సమయంలో అమాంతంగా ధరలు పెరుగుతున్నప్పటికీ వాటిని అడ్డుకట్టు వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

వాహనాలు నడిపే మైనర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-సీతానగరం: స్థానిక హను మాన్ కూడలి వద్ద పలు ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లను నిలిపి వారికి ఎస్ ఐ నీలకంఠం కౌన్సిలింగ్ ఇచ్చారు. పండగ పూట ఇళ్లకు వచ్చే పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. మైనర్లు వాహనాలను నడిపితే శిక్షలు, అపరాధ రుసుం గూర్చి వారి తల్లిదండ్రులకు తప్పించి వివరించారు. ఇదిలా ఉండగా పండుగ సందర్భంగా ప్రత్యేక నిఘా పెట్టామని, వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపిన, ర్యాస్ డ్రైవింగ్ చేసిన ముగ్గురు లేదా నలుగురు వెళ్లిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అన్ని రకాల ధృవీకరణ పత్రాలతో డ్రైవింగ్ చేయాలని, హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, డ్రైవింగ్ లో ఫోన్లో మాట్లాడిన కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

పండగ రోజున కలిసిన పూర్వ మిత్రులు

విశాలాంధ్ర-జామి: వారంతా 1992-93 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వారు. సంక్రాంతి పండగ సందర్భంగా వివిద ప్రాంతాలనుంచి సొంత గ్రామానికి వచ్చారు. ఇదే సమయంలో తమ పూర్వ మిత్రులను కలుసుకోవాలని భావించారు. అంతే శనివారం భోగీ రోజున అందరూ కలవాలని వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చుకున్నారు. దాదాపు 50మంది వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని పాత మిత్రులను కలుసుకుని ఎంతో ఆనందంగా గడిపి వెళ్లారు. పండగ పూట, మిత్రులను కలవడం మరో పండగగా మారిందని వారంతా ఆనందం వ్యక్తం చేసారు.

రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్ల పంపిణీ

విశాలాంధ్ర-బొబ్బిలి: ప్రతి బాలిక తప్పని సరిగా చదువుకోవాలని బొబ్బిలి సబ్ డివి జన్ పోలీస్ అధికారి బి మోహన్ రావు అన్నారు. శనివారం స్థానిక శ్రీ సూర్య రెసిడెన్సీ నందు బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బాలికలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ కార్యక్రమాన్ని రోటరీ అధ్యక్షులు జెసి రాజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅదితిగా విచ్చేసిన డిఎస్పీ మాట్లాడుతూ రోటరీ చేస్తున్న సేవాకార్యక్రమాలు ప్రజోపయోగ కరంగా ఉంటున్నాయన్నారు. రోటరీ అంటే సేవ అనేలా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రత్యేక అధితిగా పాల్గొన్న మాజీ రాష్ట్ర ఆర్థిక సంఘ సభ్యులు తూముల భాస్కర రావు మాట్లాడుతువిద్యార్థి దశ నుండే విద్యార్థులు సేవాదృక్పధాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తయి ఫార్మసీ చేయాలని ఆసక్తి ఉన్న బాలికలకు శ్రీ లోకబందు ఫార్మసీ విద్యాసంస్థల్లో ఉచితంగా చదువుకొనే వెసులు బాటు బొబ్బిలి రోటరీ ద్వారా కల్పిస్తామన్నారు ఈసందర్భంగా ఆపరేషన్ ఇమాజిన్ లో భాగంగా 21మంది బాలికలకు 1లక్షా 26 వేలు విలువచేసే 21 సైకిళ్లను డిఎస్పీ, తూముల కార్తిక్, జె సి రాజుల చేతుల మీదుగా బాలికలకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి శ్రీహరి, పోలియో చైర్ ఎస్ అప్పల రాజు కారుణ్య ఫౌండేషన్ చీఫ్ ఆర్గనైజర్ డేవిడ్ జె విక్టర్ కార్యనిర్వాహక కార్యదర్శి కె రామ కృష్ణ, బి లక్ష్మణ రావు, శంకర రావుబాలికల తల్లితండ్రులు పాల్గొన్నారు.

జనార్ధన స్వామికి సర్పంచ్ దంపతులు పట్టువస్త్రాల సమర్పణ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన పురాతనా లయం జనార్ధన స్వామి వారికి పట్టువస్త్రాలను గ్రామ సర్పంచ్ దంపతులు కోట్యాడ వెంకటలక్ష్మి రమణ మూర్తి దంపతులు శనివారం ఆలయం అర్చకులు ప్రసాదాచార్యుల చేతులమీదుగా స్వామివారికి సమర్పించుకున్నారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ దంపతులు కోట్యాడ వెంకటలక్ష్మి రమణ మూర్తిలు మాట్లాడుతూ గ్రామంలో ఈ జనార్ధన స్వామి వారి ఆలయం పురాతనమైనదని 826 ఏళ్ల క్రితం పూర్వీకులు నిర్మించారని నాటునుండి నేటి వరకు గ్రామ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో స్వామివారిని కొలుస్తున్నారని అయితే ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ ఆలయానికి రూపురేఖలు దిద్దుతూ ఆలయానికి కొత్త హంగులు దిద్ది నూతనంగా తయారు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే భోగి సంక్రాంతిని పురస్కరించుకొని స్వామివారికి నూతన పట్టువస్త్రాలను సమర్పించడం జరిగిందని తెలిపారు.

వేడుకగా భోగీ సంబరాలు

అవనాపు స్వగృహం వద్ద సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (%ణజమీూ%) చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైసిపి నాయకులు అవనాపు విక్రమ్ సంక్రాంతి సంబరాల్లో భాగమైన భోగి వేడుకలు జరుపుకున్నారు. ముందుగా అగ్నిదేవున్ని ఆరాధించి భోగి మంట వెలిగించారు. కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ.. భోగబాగ్యాలను అందించే భోగి పండుగ అందిరికి సుఖ సంతోషాలను ఇవ్వాలని కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందించే భోగి పండుగ అందరూ సంతోషంగా జరుపుకోవాలని అభిలషించారు.

జెడ్పీటీసీ నివాసం వద్ద భోగి వేడుకలు

చీపురుపల్లి : భోగి వేడుకలను శాస్త్రోక్తంగా, అగ్నిదేవునికి పూజలు చేసి, భోగి మంటను, జడ్పీటీసీ సభ్యులు వలిరెడ్డి శిరీష, మండల వైస్సార్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లా, మండల ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో, ఆనందంగా ఉండాలని, కోరుకుం టున్నారన్నారు. పాడి పంటలతో రైతులు అందరూ బాగుండాలని తెలిపారు. సంక్రాంతికి ఒక రోజు ముందుభోగి పండుగతో సంబరాలు మొదలవుతాయి. భోగి అంటే భోగ భాగ్యాలను అనుభవించే రోజు అని అర్థం. ఎలాగంటే పాడి పంటలు సమృద్ధిగా ఇండ్లకు వచ్చే కాల సమయం,తెలుగు ప్రజలు జరుపుకొనే అతిపెద్ద పండుగ సంక్రాంతి. ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజలు ఈ పండుగను నాలుగు రోజులపాటు ఘనంగా జరుపుకొంటారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజునే మకర సంక్రాంతి పండుగ జరుపుకుంటారు, కార్యక్రమంలో జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మండల సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, వలిరెడ్డి రవీంద్ర నాయుడు, ముళ్ళ పైడిరాజు, ప్రభాత్ కుమార్, మన్నె చిన్ని, యువత, పెద్దలు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు. వేడుకగా భోగి పండుగ..

భోగి మంటలు వేసి సందడి చేసిన యువత

శృంగవరపుకోట : ఎస్.కోట మండల పరిధి గ్రామాల్లో భోగి పండుగను యువత వేడుకగా శనివారం జరుపుకున్నారు. యువకులు తెల్లవారు జాము నుండి సమకూర్చుకున్న కర్ర దుంగలను పేర్చి శాస్త్రోక్తంగా భోగి మంటలు వేశారు. చిన్నారులు, యువతీయువకులు కొత్త బట్టలు ధరించి భోగి మంటలకు దండం పెడుతూనే పేడతో చేసిన పిడకలను మంటల్లో వేశారు. కాలిన పిడకల బూడిదను బొట్టు పెట్టుకోవడం కనిపించింది. ఎస్.కోట పట్టణంలోని మెయిన్ రోడ్డు నానిగిరి వీధి, తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా యువకులు అతిపెద్ద భోగి మంటలను వేశారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు, పండితులు మాట్లాడుతూ చీకటిని తనకు తానుగా తరిమి కొట్టడానికి వెలుతురు మంటను ఇంటి ముంగిటకు, వీధి వీధిలోనా, గ్రామాల కూడలిలో మనిషి రాజేసే ఇలాంటి పండుగ మరొకటి లేదని వ్యాఖ్యానించారు. పండుగ అంటే అందరికీ సంతోషాన్ని ఇచ్చేది. అందరి శుభాన్ని కోరడం భోగం. ఈ భోగి మంట నుండి వెలువడిన కాంతి సకల శుభాలను అందరికీ కల్పించాలని కోరేదె భోగి పండుగని పలువురు ఆకాంక్షించారు.

వేపాడ: మండలంలో శనివారం వేకువ జామున భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగ ను పురస్కరించుకొని మొదటి రోజుభోగీ పండగను ప్రజలు ఆనందంగా జరుపు కున్నారు. భక్తిశ్రద్ధలతో భోగిమంటలు వేసుకొని చలి మంటలు కాగారు .యువకులు అయితే ముందుగా సమకూర్చుకున్న పెద్దపెద్ద కలప దుంగలను మంటల్లో వేసి భారీస్థాయిలో మంటలంటించి కేరింతలు కొట్టారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా కురవడం, వాతావరణం అను కూలించడంతో ఖరీఫ్ వరి పంట ఆశాజనకంగా పండి మంచి దిగుబడులు సాధించిన రైతన్నలు పండించిన పంటను అధిక ధరలకు అమ్ముకొని కాసులు కళ్ళజూసిన రైతన్నలు సంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించుకునేందుకు ముందుకు వచ్చారు. ఆడపిల్లలు, అల్లుళ్లకు పిలుపులిచ్చుకున్న ప్రజలు రైతులు వారికి అనుకున్న కానుకులను ఇవ్వడంతో పాటు పండగ దుస్తులను సమకూర్చి ఆనందంగా గడిపారు. ముందుగా అనుకున్న విధంగా భోగి పండుగను ఘనంగా జరుపుకున్న ప్రజలు పెద్ద పండుగను వైభవంగా జరుపుకునేందుకు సంసిద్ధమవుతున్నారు

వంగర : భోగీ సంబరాలు ఘనంగా జరిగాయి.శనివారం గ్రామాల్లో వేకువ జామున 3 గంటల నుండియే నాలుగు త్రోవలు, మధ్యలో భోగీ మంటలు నాలుగు మార్గాల కలిసే చోట గ్రామాల్లో ఏర్పాటుచేయటంకనిపించింది. భోగీ లో వేస్తుగాఉన్నటువంటి పనికిరానికలప,కంపలు,ఆవు పేడలతో తయారు చేసిన పిడకలు, తదితర వాటిని వేయటం కనిపించింది.వీటన్నింటిని వేసి చుట్టూ ప్రజలు ఉండి చలి కాగటం అంతటా కనిపించింది.ఈ భోగీ మంట లు వద్దను ముఖ్యంగా మహిళలు చాలా గ్రామాల్లో భోగీ మంట లు వద్దనుప్రత్యేకాకర్షణ గా కనిపించారు.భోగిమంటలు వద్దని పాల్గొని దాన్సులుచేసి,హెూరెత్తించటం ప్రత్యేక ఆకర్షన గా కనిపించింది.ఈ భోగీ నుండి ఉత్తరాయణ సూర్యుడు రాబోతున్నడనే సంకేతంగాచెబుతుంటారు. దక్షిణాయంలో ఉండే నిద్ర బద్దకంతో సహా దగ్ధం చేయాలనే సంకేతంతో చీకటి తోనే భోగిమంట వేశారు. భోగి మంటలో వేసి వీటన్నిటినీ దారిద్ర్య చిహ్నాలుగా భావించి తగులబెడతారని ప్రతీత. వేసవిలో వేడికి తగులబడే వాటిని గుర్తించాలనే మరొక సంకేతం కూడా ఇందులో దాగిఉంది. భోగిపళ్ళుసవరించు భోగిపండ్లు అంటే రేగుపండ్లు ఇది సూర్యునికిప్రీతిపాత్రమైన పండుగ, సూర్యుని రూపం, రంగు, పేరు కలిగిన రేగుపండ్లతోనాణేలను కలిపి పిల్లల తలపై పోయటం కనిపించింది. దీనివల్ల సూర్య భగవానునిఅనుగ్రహం పిల్లలపై ప్రసరించి ఆరోగ్యం కలగాలనేసంకేతంతో భోగిపండ్లుపోయటం కనిపించింది.

కుమరాంలో రంగువల్లుల పోటీలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని కుమరాం గ్రామంలో సంక్రాంతి పండగ నేపధ్యంలో గ్రామ సర్పంచ్ పిన్నింటి రవికుమార్, ఎంపిటిసి కంది నరసింగరావు, మాజీ ఆర్మీ ఉద్యోగి భైరాగిల ఆద్వర్యంలో రంగవల్లుల పోటీలను శనివారం నిర్వహించారు. విజేతలకు ప్రత్యేక బహుమతులను అందజేసారు.

ఘనంగా భోగి పండుగ

పార్వతీపురం రూరల్ : మండలంలోని అన్ని గ్రా మాల్లో శనివారం భోగి పండుగను ఘనంగా జరుపుకు న్నారు. వేకువ జామున నిద్రలేచి ప్రజలు నాన్న పాణాలు చేసి కొత్త దుస్తులను ధరించి భోగి మంటలో కర్రలు ఇతరత్రా వస్తువులను వేసి దేవునికి ప్రార్థించుకున్నారు. మజ్జిగౌరీ హౌసింగ్ కాలనీ లో అమరపు సూర్యనారాయణ,తెర్లి సత్యనారాయణ,బేత వెంకట నాయుడు,మిర్యాల సత్యనారాయణ,కుప్పిలి ప్రసాద రావు మరిచెర్ల ధనుంజయ నాయుడు అద్వర్యంలో కార్య క్రమం జరిగింది.పిల్లలు,పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.మిఠాయిలు పంచుకోన్నారు. అదేవిధంగా నర్సిపురం బాలగోడబ వెంకంపేట చిన్న బండపల్లి ఎమ్మార్ నగరం సంగం వలస గంగాపురం కవిటిభద్ర ములగ డోకి శిలా డీకే పట్నం గోచక్క జమదాల బందలప్పి పులిగుమ్మి పుట్టూరు పెద్ద బడపల్లి కృష్ణ పల్లి పెదమరికి గోపాలపురం వెంకట్రాయుడిపేట తదితర గ్రామాల్లో భోగి మంటలు వేసి జరుపుకున్నారు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

రెడ్డివానివలసలో సంక్రాంతి ఆటల పోటీలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని రెడ్డివానివలస గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రెడ్డి శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. చుట్టు ప్రక్కల గ్రామాల యువత ఈఆటల పోటీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ కలప అక్రమ రవాణా...

చోద్యంచూస్తున్న అటవీ శాఖ

విశాలాంధ్ర-భామిని: జోరుగా అక్రమ కలప రవాణా చోద్యం చూస్తున్న అటవీశాఖ. మండలంలో తువ్వకొండ అటవీ ప్రాంతంలో విలువైన టేకు, గుగ్గిలం కలపను అర్ధరాత్రులలో దొంగతనంగా అటవీ ప్రాంతం నుండి ఎ.బి రోడ్డు మార్గంలో తరలించుకు పోతున్నారు. అటవీ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపంతో అక్రమ కలప వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. భామిని ఎగువ తువ్వకొండ మణిగ ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు, పట్టపగలే కలపను పికప్ వ్యాన్ లో లోడింగ్ చేసుకుని రాత్రి సమయాలలో తరలించుకుపోతున్నారు. మండల కేంద్రంలో గల ఆంధ్ర, ఒడిస్సా చెక్ పోస్టు మూతపడటంతో అక్రమ వ్యాపారులకు అడ్డుకొనేనాధులే కరువయ్యారు.

ఘనంగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ జన్మదినోత్సవం : ఆకుల

విశాలాంధ్ర-బొబ్బిలి : లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ 67వ జన్మదినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో లోక్ సత్తా పార్టీ విజయ నగరం జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ రావు కేక్ ను కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1956 జనవరి 14న కృష్ణాజిల్లా విజయవాడలో ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో నాగ భైరవ జయ ప్రకాష్ నారాయణ జన్మించారు. తల్లిదండ్రులు బాల కోటమ్మ, వెంకటే శ్వరరావు. గొడవర్రు గ్రామంలో పాఠశాల విద్య అనంతరం జయప్రకాష్ నారాయణ గారు విజయవాడ లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్ విద్యని అభ్యసించారు. ఆ తర్వాత 1972 లో గుంటూరు మెడికల్ కాలేజీలో చేరారు. కాలేజీ రోజుల్లో దేశ సామాజిక, రాజకీయ అంశాలపై జరిగే అంతర్ కళాశాల పోటీల్లో ఆయనే ఎప్పుడు విజేత. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా విప్లవం నడిపి ఇందిరా గాంధీని గద్దెదించిన లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ పేరునే తల్లిదండ్రులు ఆయనకు పెట్టడం యాదృచ్ఛికం. జనతా ప్రభుత్వం అంతఃకలహాలతో పతనమవుతున్న నేపథ్యంలో వ్యవస్థలో మార్పు కోసం ఏదో ఒకటి చేయాలని బలంగా భావిస్తున్న క్రమంలో ఆయన సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి మళ్లించారు. టాపర్ గా 1980 లో ఇండియన్ అడ్మి నిస్ట్రేటివ్ సర్వీస్ లో చేరారు. మంచిని మంచిగా, చెడును చెడుగా చూడగల నిష్పాక్షి కత, ప్రజల విజ్ఞత పట్ల చెదరని విశ్వాసం ఆయనను సాహసోపేతంగా మహా కార్యాల దిశగా ప్రేరేపించాయి. రోల్ మోడల్ గా నిలిచిపోయి, జన రాజకీయవేత్తగా మలి చాయి. విస్తృత జన హితం కోసం తన 16 ఏళ్ల కెరీర్ అంతరం ఉద్యోగాన్ని విడిచిపెట్టి ప్రజా ఉద్యమంలోకి అడుగుపెట్టి లోక్ సత్తా ఉద్యమ సంస్థను ఆ తర్వాత లోక్ సత్తా పార్టీని స్థాపించారని అన్నారు.

ఘనంగా గోదా రంగనాథ కళ్యాణం

విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం పెద్ద వీధిలో వేంచేసి యున్న శ్రీరామాలయంలో గోదాదేవి కళ్యాణంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గురునాథ శర్మ, రాధాకృష్ణ మూర్తి, హర్షవర్ధన్ ల ఆధ్వర్యంలో ఆలయ దర్మకర్తలు కొమ్మూరు సుభూషణరావు దంపతులు పాల్గొని వేదికలో ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠింపజేసిమంత్రోచ్చరణల మధ్య కళ్యాణాన్ని జరిపించారు.ధనుర్మాస ముగింపు సందర్భంగా ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న సేవల్లో భాగంగా భోగి పర్వదినాన్ని పురష్కరించుకొని గోదాదేవి రంగనాధ స్వామి కళ్యాణాన్ని శాస్త్రోక్తవిధానంతో పురోహితులు నిర్వహించారు. అనంతరం జ్ఞానేశ్వర్ కళ్యాణ్ ప్రవచనం ఆకట్టుకుంది. కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించి ఆనంద పరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్, కొమ్మూరి మాధురి, శివరామ భక్త మండలి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గోదాదేవి కళ్యాణమహోత్సవం

విశాలాంధ్ర -విజయనగరంటౌన్: పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీకళ్యాణవేంకటే శ్వరస్వామి ఆలయంలో గతనెలరోజులుగా ధనుర్మాసోత్స వాలు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు భోగిపండగరోజున ఉదయం జరిగిన గోదాదేవి కళ్యాణమహెూత్సవంతో వైభవంగా ముగిసాయి. త్రిదండిఅహెూబిలరామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన కళ్యాణం ను శ్రీశ్రీనివాస సేవాసంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిల్లావిజయకుమార్, చెరుకూరి శ్రీధర్ కమిటీసభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పీసపాటిసంపత్ కుమారాచర్యులు ,శ్రీమన్నారాయణాచార్యులు ఉత్సవాన్ని వైభవంగా నిర్వ హించారు. భక్తులు గోదాదేవి కళ్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో సేవాకాలం, పాశురప్రవచనాలు ,ఆధ్యాత్మిక ప్రసంగాలకు అశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

శృంగవరపుకోట క్రికెట్ లీగ్ విజేత ఎస్ ఎస్ వారియర్స్

ద్వితీయ స్థానంలో రైల్వేస్టార్స్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగ వరపుకోట క్రికెట్ లీగ్ విజేతగా ఎస్ ఎస్ వారియర్స్ జట్టు నిలవగా రైల్వే స్టార్స్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రోఫీ, ప్రథమ విజేతకు రూ.45వేలు, రన్నరప్ కు రూ.30 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్ మెన్ గా గిబ్స్, బౌలరుగా సాయి నిలిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. క్రీడల్లో రాణించిన యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.సింహాద్రి నాయుడు, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, ముఖ్య నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన గోదాదేవి కళ్యాణం

ముగిసిన ధనుర్మాస పూజలు

విశాలాంధ్ర -సీతానగరం: మండలంలోని అన్నిగ్రామా లలో గతనెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస పూజలు శనివారంతో ముగిసాయి.భక్తులు, గోవింద నామ పారాయణం చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో వేకువజామునుండే నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గోవిందనామ స్మరణతో, మేలతాళాలతో, తప్పిటగుల్లతో గతనెలరోజులుగా నిర్వహించడం గమనార్హం.శనివారం స్థానిక శ్రీవేణుగోపాల స్వామిఆలయం, శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో, లచ్చయ్యపేట ఎన్ సి ఎస్ చక్కెర కర్మాగార పరిధిలోగల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గోధాదేవి కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముగింపు రోజున పల్లకిలో భగవంతుని ఊరేగింపు నిర్వహించగా, దర్శనకుకోసం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. గత నెల రోజులుగా గోవిందమాలను చేపట్టిన భక్తులు స్థానిక సువర్ణముఖి నదిలో స్నానాలుచేసి, వేదమంత్రాలు చదువుతూ మాలను తీసివేసారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజచార్యులు, మురారి, రఘులు ఆధ్వర్యంలో గోధాదేవి కళ్యాణంను నాలుగు గంటల పాటు నిర్వహించి ధనుర్మాస పూజలు ముగించారు.

పోలీస్ కృష్ణమూర్తికి పౌర సన్మానం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ లో వృద్ధ మిత్ర కో-ఆర్డినేటర్ గా పనిచేయుచున్న కె.క్రిష్ణమూర్తి ఆయన చేస్తున్న సమాజ సేవలకు గాను పట్టణానికిచెందిన రగుమండల సత్యన్నారాయణ, ఇసకల.ఉదయ్ తదితరులు కృష్ణమూర్తికి సాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణమూర్తి చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకుని మరికొందరు సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు.సన్మాన గ్రహీత కృష్ణమూర్తి మాట్లాడుతూ తనకు వస్తున్న నెలవారి వేతనంలో కొంత భాగాన్ని పేదలకు, వృద్ధులకు ఇచ్చేందుకుగాను నిర్ణయించుకున్నానని అటువంటి సేవాభాగ్యం కలగడం చాలా ఆనందదాయకంగా ఉందని నేను మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవ చేస్తున్నానని మిగిలిన వారు కూడా తనకు నచ్చిన వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని సమాజసేవ చేసేందుకు ముందుకు రావాలని హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు నరసింహం కన్నుమూత

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రముఖ ఉపాధ్యాయ ఉద్యమ నాయ కులు యుఏ. నరసింహం శనివారం తెల్లవారుజామున విజయ నగరం లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాస్టారు మరణ వార్త తెలిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని దర్శించి, పూలమా లలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగా ఢ సానుభూతిని తెలియజేశారు. తన సాయి ఫౌండేషన్ ఆధ్వర్యం లో ప్రతి ఏటా పదవ తరగతి మరియు ఇంటర్ విద్యార్థులకు ఇచ్చే ప్రతిభ పురస్కారాలకు గాను , విద్యా కమిటీకి మాస్టారు చైర్మన్గా ఉంటూ ఎనలేని సేవలు అందించారని అన్నారు. మాస్టారి మరణం ఉపాధ్యాయులకే కాకుండా, తనకు వ్యక్తిగతంగా తీరనిలోటు అని అన్నారు. 1932 వ సంవత్సరంలో సింహాచలంలో జన్మించిన మాస్టారు 1953లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశం చేశారు. నెల్లిమర్ల, ఎస్ కోట, పూసపాటి రే గ, వియ్యం పేట, రామ తీర్థాలు లో పనిచేసి, 1990లో పదవీ విరమణ చేశారు. 1983 సెప్టెంబర్ 5న ఉమ్మడి ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు చేతులమీదుగా ఉత్తమ ఉపాధ్యాయునిగా విశిష్ట పురస్కారం అందుకున్నారు. 1984 సెప్టెంబర్ 5న జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా అప్పటి రాష్ట్రపతి దివంగత జ్ఞాని జైల్ సింగ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ బంధుగా పిలవబడే మాస్టారు ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించడంలో వారధిగా నిలిచారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు లో రెండుసార్లు పోటీ చేశారు. మాస్టారు మరణ వార్త తెలియగానే నగరానికి చెందిన ప్రముఖులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలివచ్చి ఆయనకు ఘన నివాళు లర్పించారు. మాస్టారు భౌతికాయానికి శనివారం నాడు దాసన్నపేట స్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

తల్లిదండ్రులు, అన్న జ్ఞాపకార్థంతో పేదలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: స్థానిక క్రాలేటి వారి వీధికి చెందిన విస్డం అకాడమీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్, వైఎస్ఆర్సిపి నాయకులు, వెనుకబడిన కులాల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి రాఘవ కుమార్ శనివారం తన స్వగృహం వద్ద తన తల్లిదండ్రులు, అన్నదమ్ముడు జ్ఞాపకార్థం తో పాటు సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు చీరలను పంపిణీ చేశారు. చీరలు తీసుకున్న పేద మహిళలు రాఘవ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాఘవ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఈ సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని ఎవరికి కలిగిన తోచిన సహాయం వారు చేయాలని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో విస్డం అకాడమీ కోచింగ్ సెంటర్ విద్యార్థులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో గోదా కళ్యాణం

విశాలాంధ్ర-రేగిడి: రేగిడి మండలంలోని పనసలవలస గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం భోగి సందర్భంగా గోదా కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయఅర్చకులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలోఈ కార్యక్రమం జరిగినట్లు ఆలయ ధర్మకర్త రంగబాబుగారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పనసలవలస,బాలకవివలస, మునకలవలస, కొర్లవలస గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికి వచ్చిన దిబ్బలపాలెం విద్యుత్ లైన్ల వ్యవహారం



విశాలాంధ్ర-భోగాపురం: మండలం లోని చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం గ్రామం లో హై టెన్షన్ విద్యుత్ లైన్ రహదారి మధ్యలో నుంచి వేసేందుకు సాగి అప్పల నరసింహ రాజు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎటువంటి అనుమతులు లేకుండా ఇటీవల తవ్వకాలు జరిపిన విషయం తెలిసిందే. దీంతో రైతులు, గ్రామస్తులు ఒకరిపై ఒకరు దానికి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసారు. దీనిపై పోలీసులు కూడా కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై రైతులు సంబంధిత రియల్ ఎస్టేట్ యజమాని గ్రామస్తులు సహకారంతో రాజీ కుదుర్చుకొనగా, ఈ అనుమతి లేని తవ్వకాలపై అదే గ్రామానికి చెందిన గుడ్ల శివ అనే రైతు రాజీకి ఒప్పుకోకుండా ఫిర్యాదు మళ్లీ చర్చనీయాంసంగా మారింది. దీంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చినట్టైంది. రహదారితో పాటు మా భూముల్లో నుంచి మా అనుమతులతో పాటు సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా విద్యుత్తు లైన్లు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతేకాక అడ్డుపడినందుకు మాపై పోలీస్‌స్టేషన్లో అక్రమ కేసులు పెడుతున్నారని ఆయన విలేకరులకు తెలిపాడు.

విద్యుత్ శాఖ విధివిధానాలపై కొరవడిన స్పష్టత

భూమిలో నుంచి రహదారితో పాటు రైతుల భూముల్లో నుంచి తవ్వి విద్యుత్ లైన్ వేయడంపై సంబంధిత రియల్ ఎస్టేట్ యజ మానికి విద్యుత్ శాఖ అనుమతులు ఉన్నాయా ? ఉంటే ఆ అనుమతులు ఇచ్చిన అధికారులు ఎవరన్నది చర్చనీయాంశంగా మారింది